

## మళ్లీ పెరిగిన పుత్తడి

న్యూఢిల్లీ, మే 2: బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు దేశీయంగా ఆభరణాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా పుత్తడి ధర రూ.96 వేల మార్క్‌ను అధిగమించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.1,080 ఎగబాకి రూ.96,800 పలికింది. గురువారం భారీగా తగ్గిన ధరలు మళ్లీ ఆ మరుసటి రోజే పెరగడం విశేషం. స్థానిక ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని ట్రేడర్ వెల్లడించారు. పసిడితోపాటు కిలో వెండి రూ.1,600 ఎగబాకి రూ.97,100 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 23.10 డాలర్లు పెరిగి 3,262.30 డాలర్లకు చేరుకోగా, వెండి 32.49 డాలర్లుగా ఉన్నది.

## ఆడీ కార్లు ప్రియం

న్యూఢిల్లీ, మే 2: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ ఇండియా మరోసారి ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల మాడళ్ల ధరలను రెండు శాతం వరకు సవరిస్తున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతోపాటు ఎక్స్చేంజ్ రేట్లలో మార్పులు చోటు చేసుకోవడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని తెలిపింది.

## విక్రయదారులకు అమెజాన్ దన్ను

హైదరాబాద్, మే 2: దేశవ్యాప్తంగా ఉన్న చిన్న స్థాయి విక్రయదారులకు అమెజాన్ శుభవార్తను అందించింది. రూ.300 కంటే తక్కువ ధర కలిగిన ఉత్పత్తులపై రెఫరల్ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో విక్రయదారులు తక్కువ ధర కలిగిన వస్తువులపై గణనీయమైన రీతిలో పొదుపు చేసుకునేందుకు అవకాశం లభించనున్నదని అమెజాన్ ఇండియా సేల్స్ డైరెక్టర్ గౌరవ్ భట్నాగర్ తెలిపారు. దుస్తులు, బూట్లు, ఫ్యాషన్ నగలు, గృహోపకరణాలు, వంటగదికి సంబంధించి 135కి పైగా రంగాలకు చెందిన ఉత్పత్తులకు ఈ నిర్ణయం వర్తించనున్నది. తెలంగాణ నుంచి 50 వేల మంది విక్రయదారుల నుంచి సేకరించి తమ ఉత్పత్తులను అమెజాన్‌లో విక్రయిస్తున్నాయి.

# వృద్ధికి టారిఫ్ దెబ్బ

**ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జీడీపీ అంచనాను తగ్గించిన ఎస్అండ్‌పీ**

- *6.5 శాతం నుంచి 6.3 శాతానికి కోత*
- *ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం*
- *ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి రూపీ పతనం!*




న్యూఢిల్లీ, మే 2: భారత జీడీపీ అంచనాలకు ప్రముఖ గ్లోబల్ రేటింగ్స్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ కోత పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2025–26)గాను దేశ వృద్ధిరేటు 6.3 శాతంగానే ఉండొచ్చని శుక్రవారం పేర్కొన్నది. ఇంతకుముందు అంచనా 6.5 శాతంగా ఉండటం గమనార్హం. 'ప్రపంచ స్థూల ఆర్థిక వ్యవస్థ సమాచారం: ఆర్థిక వృద్ధిని నెమ్మదింపజేస్తున్న అమెరికా వాణిజ్య విధానంలోని భారీ మార్పులు' పేరిట ఓ నివేదికను ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తాజాగా విడుదల చేసింది. ఈ సందర్భంగానే గతంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రగతికి సంబంధించి పేర్కొన్న అంచనాలను సవరించింది.

### ట్రంప్ సుంకాల సెగ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలకు తెరలేపడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. అయితే చైనా మినహా మిగతా దేశాలపై విధిస్తామన్న టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేయడం కొంతలోకొంత ఊరటనిచ్చింది. ఈ క్రమంలోనే భారత్‌సహా ఆయా దేశాలు.. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే పనిలోపడ్డాయి. అయినప్పటికీ ఈ ట్రేడ్ వార్‌పై అనిశ్చిత పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉండటంతో.. ఆ సెగ ఇప్పుడు దేశ జీడీపీ అంచనాకు తాకింది. నిజానికి ఈ ఏడాది మార్చిలోనే దేశ వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 6.5 శాతంగానే ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంచనా వేసింది. అంతకుముందు ఇది 6.7 శాతంగా ఉంటుందన్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో 0.2 శాతం మేర తగ్గొచ్చని ప్రకటించింది. ఈ లెక్కన చూసుకుంటే జీడీపీ అంచనాకు దాదాపు అర శాతం కత్తెర పడినట్టే అనుకోవచ్చు. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27) దేశ జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంటున్నది.

### రూపాయి అధోగతే..

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి దిగజారవచ్చని ఎస్అండ్‌పీ ఈ సందర్భంగా తమ రిపోర్టులో పేర్కొన్నది. ప్రస్తుతం 84.57 వద్ద రూపీ వాల్యూ కదలాడుతుండగా.. 2024 చివర్లో 85.64 వద్ద ఉన్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటి దాకానైతే రూపాయి మారకం విలువ రూపాయికిపైగానే కోలుకున్నట్టు కనిపిస్తున్నది. అయితే గడిచిన ఈ 4 నెలల్లో తీవ్ర ఒడిదొడుకులనూ చవిచూసింది. ఫిబ్రవరి 6న మునుపెన్నడూ లేనివిధంగా 87.59 స్థాయికి క్షీణించింది. ఒకానొక దశలో 87.60 స్థాయినీ తాకింది. ఈ నేపథ్యంలో ఎస్అండ్‌పీ అంచనా మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. మళ్లీ రూపాయి ఒత్తిడికి లోనవబోతున్నదన్న సంకేతాలనిస్తున్నది.

**2025-26కుగాను దేశ జీడీపీ అంచనాలకు కోతలు**

| సంస్థ | ప్రస్తుతం | మునుపు |
|---|---|---|
| ఆర్బీఐ | 6.5% | 6.7% |
| ఫిచ్ | 6.4% | 6.5% |
| ఓఈసీడీ | 6.4% | 6.9% |
| ఎస్అండ్‌పీ | 6.3% | 6.5% |
| ప్రపంచ బ్యాంక్ | 6.3% | 6.7% |
| ఐఎంఎఫ్ | 6.2% | 6.5% |
| మూడీస్(2025) | 6.1% | 6.4% |

- ఈ ఏడాది అమెరికా జీడీపీ వృద్ధిరేటు 1.5 శాతంగా, వచ్చే ఏడాది 1.7 శాతంగా ఉండొచ్చంటున్న ఎస్అండ్‌పీ.
- **చైనా జీడీపీ వృద్ధిరేటు ఈ ఏడాది 0.7 శాతం తగ్గి 3.5 శాతానికే పరిమితం కావచ్చు. వచ్చే ఏడాదైతే 3 శాతంగానే ఉండొచ్చని అంచనా.**
- అమెరికాతో సుంకాల సమరానికి బదులుగా చాలా దేశాలు వాణిజ్య ఒప్పందాలనే చేసుకునే వీలుందంటున్న ఎస్అండ్‌పీ.
- **అమెరికా, యూరప్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు సంక్లిష్టం కావచ్చు. కఠిన వైఖరికే మొగ్గుచూపుతున్న కెనడా.**
- పరస్పర ప్రతీకార సుంకాలతో ఏ దేశానికీ లాభం ఉండదంటున్న ఎస్అండ్‌పీ. ఈ తరహా రక్షణాత్మక ధోరణులు మంచివికావని హితవు.



## టాప్‌గేర్‌లో క్రెటా విక్రయాలు

న్యూఢిల్లీ, మే 2: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్‌కు చెందిన ఎస్‌యూవీ మాడల్ క్రెటా మరో మైలురాయిని సాధించింది. వరుసగా రెండో నెల ఏప్రిల్‌లోనూ అత్యధికంగా అమ్ముడైన వాహనాల్లో తొలిస్థానంలో నిలిచింది. గత నెలలో 17 వేల యూనిట్ల క్రెటా వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన దాంతో పోలిస్తే 10 శాతం వృద్ధిని కనబరిచాయి. సంస్థ మొత్తంగా 69,914 యూనిట్ల వాహనాలను విక్రయించగా, వీటిలో ఎస్‌యూవీ వాటా 71 శాతంగా ఉన్నదని పేర్కొంది. ఈ వాహనంపై కస్టమర్లు పెట్టుకున్న నమ్మకానికి ఇది నిదర్శనమని కంపెనీ సీవోవో, డైరెక్టర్ తరుణ్ గార్గ్ తెలిపారు. క్రెటాతోపాటు వెన్యూ, ఎక్స్‌టర్, అల్కాజర్, ఇతర మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. పదేండ్ల క్రితం దేశీయ రోడ్లపైకి అందుబాటులోకి వచ్చిన ఈ మాడల్‌కు 12 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు.

## అమెరికాలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లు

- **యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడి**


న్యూఢిల్లీ, మే 2: అమెరికాలో అమ్ముడుకానున్న ఐఫోన్లలో భారత్‌లో తయారైనవే అత్యధికంగా ఉండనున్నాయని యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడించారు. వరుసగా ఏడో త్రైమాసికంలోనూ చైనాలో ఐఫోన్ల అమ్మకాలు తగ్గుముఖం పట్టడంతో సంస్థ ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది. ఒక వైపు ప్రతీకార సుంకాలు విధిస్తుండటంతో భారత్‌లో తయారవుతున్న ఐఫోన్లను భారీగా దిగుమతి చేసుకోవాలని చూస్తున్నది సంస్థ. జూన్ త్రైమాసికం నాటికి యూఎస్‌లో అమ్ముడుకానున్న అత్యధిక ఐఫోన్లలో భారత్ నుంచి దిగుమతి చేసుకునేవే ఉండనున్నాయని, అలాగే వియత్నాం నుంచి ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాచెస్, ఎయిర్‌ప్యాడ్స్ ఉండనున్నాయని చెప్పారు. 2024లో అమెరికాలో 75.9 మిలియన్ల ఐఫోన్లు అమ్ముడయ్యాయి. ఇప్పటికే యునైటెడ్ స్టేట్స్‌కు భారత్ నుంచి అత్యధికంగా ఐఫోన్లు ఎగుమతి అవుతున్నాయని, ఫిబ్రవరితో ముగిసిన మూడు నెలలకాలంలో ఎగుమతులు 82 శాతం పెరిగాయని, ఇదే క్రమంలో మార్చి నాటికి 97.6 శాతానికి చేరుకున్నాయని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటిలిజెన్స్ తన నివేదికలో వెల్లడించింది. మార్చితో ముగిసిన రెండో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 90.75 బిలియన్ డాలర్ల నుంచి 95.35 బిలియన్ డాలర్లకు చేరుకున్నది.



## కోలుకున్న స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 260, నిఫ్టీ 12 పాయింట్ల లాభం

ముంబై, మే 2: దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. అమెరికా–భారత్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశాలుండటం, రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లుకావడం మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. వీటికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఎగబడి కొనుగోళ్లు జరపడం, అంతర్జాతీయ మార్కెట్లు ఆశాజనకంగా ట్రేడవడంతో సూచీలకు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇంట్రాడేలో 900 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 259.75 పాయింట్లు అందుకొని 80,501.99 వద్ద ముగియగా, మరో సూచీ నిఫ్టీ 12.50 పాయింట్లు పెరిగి 24,346.70 పాయింట్లకు చేరుకున్నది. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో అదానీ పోర్ట్ షేరు 4 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, మారుతి, టాటా మోటర్స్, ఐటీసీ, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో ముగియగా..నెస్లె, ఎన్టీపీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్, టైటాన్ షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా సర్వీసెస్ 1.67 శాతం అధికంకాగా, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..టెలికం, కన్జ్యూమర్ డ్యూరబుల్, పవర్, యుటిలిటీ, మెటల్, రియల్టీ రంగ షేర్లు నష్టపోయాయి.




## సర్కారీ అప్పులు తగ్గాలి

- **అప్పుడే దేశ క్రెడిట్ రేటింగ్ జూమ్**
- **డీఈఏ కార్యదర్శి అజయ్ సేథ్**

న్యూఢిల్లీ, మే 2: దేశ రుణ భారం చాలా ఎక్కువగా ఉందని, ఇది తగ్గాలని.. అప్పుడే గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు భారత క్రెడిట్ రేటింగ్‌ను పెంచుతాయని ఆర్థిక వ్యవహారాల (డీఈఏ) కార్యదర్శి అజయ్ సేథ్ అన్నారు. ఈ సర్కారీ అప్పులపై చెల్లించే వడ్డీ భారం కూడా మోయలేనివిధంగా తయారవుతున్నదని, దాన్ని దించుకోవాల్సిన అవసరం ఎంతో ఉన్నదనీ ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఐఎస్‌ఏపీసీ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ కాన్ఫరెన్స్‌లో అజయ్ మాట్లాడుతూ.. అప్పులు పెరుగుతూపోవడం మంచిదికాదన్నారు. రేటింగ్ అప్‌గ్రేడ్ కోసం రేటింగ్ ఏజెన్సీలతో భారత్ ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తోందని వివరించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడానికి మితిమీరిన రుణ భారమేనంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఖర్చులకు సంబంధించి స్పందిస్తూ.. చాలావరకు సమతూకం లోపించిందన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాభివృద్ధి కంటే రుణ నిధులను వ్యయాలను పెంచుకోవడానికే వినియోగిస్తున్నాయన్నారు. కాగా, ట్యాక్స్–టు–జీడీపీ రేషియో 20 శాతానికి చేరాలంటే 5–6 ఏండ్లు పట్టవచ్చన్నారు.

## బ్యాంకులపై ఆర్బీఐ భారీ జరిమానా

ముంబై, మే 2: నాలుగు బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ షాకిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకుగాను ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాతో పాటు మరో రెండు బ్యాంకులపై భారీ స్థాయిలో జరిమానా విధించింది. వీటిలో ఐసీఐసీఐ బ్యాంక్‌పై రూ.97.80 లక్షలు, బ్యాంక్ ఆఫ్ బరోడాపై రూ.61.40 లక్షలు, ఐడీబీఐ బ్యాంక్‌పై రూ.31.8 లక్షలు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రపై రూ.31.80 లక్షల చొప్పున విధించింది. కేవైసీ నిబంధనలు పట్టించుకోకపోవడం, సైబర్ సెక్యూరిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్లనే జరిమానా విధించింది.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి : పెద్ది


పెద్ది సుదర్శన్‌రెడ్డి


నర్సంపేట, మే2: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.25వేల పరిహారం చెల్లించా లని కోరారు. పంట నష్టంపై స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. కొన్ని చోట్ల కోతలు పూర్తి చేసుకొని అమ్మకానికి కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురుచూస్తున్న రైతుల ధాన్యం తడిసిపోయిందని తెలిపారు. ఖానా పురం మండలంలో పది రోజుల క్రితం తాను క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నష్టాన్ని విన్నవించినప్పటికి ఎలాంటి ప్రయోజనం లేదని పేర్కొ న్నారు. రైతులను పట్టించుకునే స్థితిలో ప్రస్తుత ఎమ్మెల్యే గానీ, అధికారులు గానీ లేరని విమర్శించారు. పంట నష్టాన్ని బీఆర్ఎస్ శ్రేణులు పరిశీలించి రైతులకు అండ గా నిలబడి భరోసా కల్పించాలని పెద్ది పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.

## నీటి సంపులో పడి చిన్నారి మృతి


ఆర్యన్(ఫైల్)


భీమదేవరపల్లి, మే 2 : ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి బాలుడు కూన ఆర్యన్(01) మృతి చెందిన విషాద ఘటన కొత్తపల్లి బీసీ కాలనీలో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కూన రవళి–రాకేశ్ దంపతులకు ఏడాది వయసున్న కుమారుడు ఆర్యన్ ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందాడు. రాకేశ్ ఉదయం బయటి నుంచి వచ్చి సంపు వద్దకు వెళ్లగా, నీటిని తేలియాడుతూ ఆర్యన్ మృతదేహం కనిపించింది. రాకేశ్ అరుపులకు ఉలిక్కిపడిన రవళి వంట గది నుంచి పరుగెత్తుకు వచ్చింది. విగతజీవిగా పడి ఉన్న ఆర్యన్‌ను చూసి గుండెలు బాదుకుంది. తల్లిదండ్రుల ఆర్తనాదాలు గ్రామస్తుల హృదయాలను కలిచివేశాయి.

## హార్వెస్టర్ కింద పడి రైతు మృతి


రావుజ్యా(ఫైల్)

నర్సంపేట, మే 2: ప్రమాదవశాత్తు హార్వెస్టర్ కింద పడి రైతు మృతి చెందిన ఘటన నర్సంపేట మండలంలోని ముగ్దుంపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇస్లావత్ రావుజ్యా(65)–జానకి దంపతులకు కూతురు ఉంది. వీరికి ఇదే గ్రామ శివారు ముగ్దుంపురం చెరువు కింద ఎకరం వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో వరి సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకోగా, రావుజ్యా శుక్రవారం హార్వెస్టర్‌ను పొలం వద్దకు తీసుకెళ్లాడు. డ్రైవర్ వరి కో సే పనిలో నిమగ్నం కాగా, రావుజ్యా దాని వెనకాల గడ్డి ఏరివేత పనిలో ఉన్నాడు. ఈ క్రమంలో డ్రైవర్ ఒక్కసారిగా హార్వెస్టర్‌ను వెనక్కి తీయగా రావుజ్యా తలపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

## 63 మంది పోలీసు సిబ్బంది బదిలీ


మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, మే 2 : సాధా రణ బదిలీల్లో భాగంగా 63 మంది పోలీ సు సిబ్బందిని బదిలీ చేస్తూ శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఒకే పోలీసు స్టేషన్‌లో ఐదు సంవత్సరాలు పనిచేసిన వారికి స్థానచలనం కల్పిస్తున్నట్లు తెలిపారు. పోలీసు స్టేషన్లలో ఖాళీలను సిబ్బందికి తెలుపుతూ సీనియారిటీ ప్రకారం కేటాయించామన్నారు. బదిలీ అయిన వారిలో 52 మంది కానిస్టేబుళ్లు, ఏడుగురు మహిళా కానిస్టేబుళ్లు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు ఏఎస్సైలు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, జిల్లా పోలీసు కార్యాలయ ఏవో వసీం ఫర్హానా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నరేశ్‌కుమార్, డీపీవో సూపరింటెండెంట్ వంశీ, ఎస్సై శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శివరాంరెడ్డి, సీసీ ఫసియుద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ముక్కు మూసుకోవాల్సిందే!

**కంపు కొడుతున్న ఎంజీఎం దవాఖాన**

- **హాస్పిటల్‌లో లోపించిన పారిశుధ్యం, భద్రత**
- **ఆవరణలో దర్శనమిస్తున్న ఖాళీ మద్యం బాటిళ్లు**
- **డస్ట్‌బిన్స్ నిండిపోయినా పట్టింపు లేని సిబ్బంది**
- **ఇబ్బందులు పడుతున్న రోగులు, అటెండెంట్లు**
- **పట్టించుకోని హాస్పిటల్ అధికారులు**

వరంగల్ చౌరస్తా, మే 2 : ఉత్తర తెలంగాణ పేద ప్రజలకు పెద్ద దిక్కుగావున్న ఎంజీఎం ఆస్పత్రి కంపు కొడుతున్నది. నిత్యం వేల మంది పేషెంట్లతో రద్దీగా ఉండే దవాఖానలో పారిశుధ్యం లోపించడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. దీంతో ఆస్పత్రిలోని పలు విభాగాల్లో ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. హాస్పిటల్ ఆవరణలో సైతం పారిశుధ్య చర్యలు తూతూ మంత్రంగా నిర్వహిస్తుండడంతో జూనియర్ డైట్ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. నైట్ షిఫ్టు సెక్యూరిటీ సిబ్బంది పది గంటల వరకు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. అత్యవసర విభాగం మినహాయించి మరే వార్డుల్లోనూ కనిపించడం లేదు. దీంతో పేషెంట్ అటెండెంట్లు ఆస్పత్రి ఆవరణలోనే యధేచ్ఛగా మద్యం సేవిస్తున్నారు. వీరికి కొందరు సెక్యూరిటీ సిబ్బంది కూడా సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అదునుగా హాస్పిటల్ ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయి. పేషెంట్ కేర్ సిబ్బంది సైతం తామేమీ తక్కువ కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వైద్య పరీక్షల కోసం రోగులను తీసుకెళ్లే సమయంలో అందుబాటులో ఉంటూ జాగ్రత్తగా చూసుకోవాల్సిన పేషెంట్ కేర్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో మరీ ముఖ్యంగా ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడుతున్న వారు ప్రత్యక్ష నరాన్ని అనుభవిస్తున్నారు. వీల్‌చైర్లు, స్ట్రెచర్లకు సెలైన్ స్టాండ్ సౌకర్యం లేకపోవడంతో రోగి అటెండెంట్లే బాటిళ్లు చేత పట్టుకొని వెళ్లాల్సి వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం, భద్రతా వ్యవస్థ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, రోగులకు సరైన వైద్యసేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.


దవాఖాన ఆవరణలో తాగిపడేసిన వాటర్ బాటిల్స్

ఎంజీఎం హాస్పిటల్ క్యాజువాలిటీలో తొలగించని బయోమెడికల్ వేస్టేజ్

పేషెంట్ కేర్ సిబ్బంది లేకపోవడంతో ఎక్స్‌రే కోసం ఇబ్బందులు పడుతున్న రోగులు, అటెండెంట్లు, సెలైన్ స్టాండ్ లేక సెలైన్ బాటిల్ చేతితో పట్టుకొని నిల్చున్న అటెండెంట్


అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

## గాలివానతో రూ.55 లక్షల నష్టం

**ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి**

**దెబ్బతిన్న స్తంభాలు, తెగిపోయిన లైన్ల పరిశీలన**

వెంకటాపూర్, మే 2 : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు భారీ ఈదురుగాలులకు భూపాలపల్లి సర్కిల్ పరిధిలో విద్యుత్ శాఖకు రూ. 55 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని వెల్తుర్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో దెబ్బతిన్న స్తంభాలు, తెగిపోయిన లైన్లను ఆయన పరిశీలించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాత్రంతా సిబ్బంది శ్రమించి యుద్ధప్రాతిపదికన విద్యుత్‌ను పునరుద్ధరించారన్నారు. మరికొన్ని చోట్ల ముమ్మరంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 351 స్తంభాలు నేలకొరిగాయని, ఎప్పుడు ఈదురుగాలులు, వర్షాలు వచ్చినా ఎక్కువగా నష్టపోయేది విద్యుత్‌శాఖే అన్నారు. సరఫరా మెటీరియల్ అందుబాటులో ఉంచుకున్నామని, ఎక్కడ ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. మెరుగైన సరఫరా అందించడానికి సిబ్బంది నిబద్ధతతో పనిచేస్తున్నారని వివరించారు. ఆయన వెంట సీఈ రాజుచౌహాన్, సర్కిల్ ఎస్ఈ మల్చూర్ నాయక్, జీఎంఏ సురేందర్, ములుగు డీఈ నాగేశ్వర్‌రావు, భూపాలపల్లి డీఈ పాపిరెడ్డి, డీఈ సదానందం, ఏడీఈ వేణుగోపాల్, ఏఈ రమేశ్, సబ్ ఇంజినీర్ సాంబరాజు, సిబ్బంది ఉన్నారు.

## నీట్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు: సీపీ

సుబేదారి, మే 2 : ఈ నెల 4న నీట్ సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధి హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లోని మొత్తం 13 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగనున్న నీట్ పరీక్షకు 5,260 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమల్లో ఉంటుందన్నారు.


## తరుగుతో అన్నదాతలు ఆగం

- **5 నుంచి 10 కిలోల వరకు కటింగ్**
- **దండుకుంటున్న మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు**

ములుగు, మే 2(నమస్తే తెలంగాణ) : యాసంగి సీజన్‌లో ములుగు జిల్లాలో వరి పంటను సాగు చేసిన రైతులు గోస పడుతున్నారు. వడగండ్ల వాన కారణంగా ఇప్పటికే నష్టాల్లోకి కూరుకుపోయిన రైతన్న.. చేతికొచ్చిన పంటను చూసి అమ్ముకునేందుకూ అరిగోస పడాల్సి వస్తున్నది. ఆరుగాలం శ్రమించి కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వస్తే నిర్వాహకులు, రైస్‌మిల్లర్ల తీరుతో తరుగు తీస్తూ ఆగం చేస్తున్నారు. ములుగు జిల్లావ్యాప్తంగా ధాన్యం సేకరించేందుకు 150 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 56 ఐకేపీ సెంటర్లు, 76 పీఏసీఎస్ సెంటర్లు, 11 జీసీసీ కేంద్రాలు, 7 ఎఫ్‌పీఓ కేంద్రాలు ఉన్నాయి. రైతులు దళారులను నమ్మిమోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించేందుకు వస్తే తరుగు పేరుతో క్వింటాకు రైతుల నుంచి 5–10 కిలోల వరకు సన్నవడ్లలో కొర్రీలు పెట్టి తరుగు తీసుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. కష్టపడి పండించిన పంటలో సగం వడగండ్ల వానపాలైందని, వచ్చిన పంటలో తరుగు తీస్తే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు తూట్లు పొడుస్తున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అనుక్షణం పరిశీలించాల్సిన అధికారులు అటుగా వెళ్లకపోవడంతో చేసేదేమీ లేక రైతులు గుండెలనిండా భారంతో తరుగుకు ఒప్పుకొంటున్నారు. కొందరు రైతులు తరుగు తీసేది లేదని మొండిగా ఉన్న క్రమంలో వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా వారు సైతం చేసేది ఏమి లేక ఒప్పుకోవాల్సిన పరిస్థితికి వస్తున్నది. అదీగాక కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవు. తాగునీరు, నీడ కోసం టెంట్లు, వర్షం వస్తే ధాన్యం తడువకుండా టార్పాలిన్ సీట్లు, వడ్లు తూర్పార పట్టేందుకు యంత్రాలు సమకూర్చలేదు.

**5కిలోలు కటింగ్ చేస్తున్నారు**

**– కర్నె సంపత్, జంగాలపల్లి రైతు, ములుగు జిల్లా**



జంగాలపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద వడ్లను ఆరబోసి వారం రోజులు అవుతుంది. తేమ శాతం ఉన్నప్పటికి తరుగుకు ఒప్పుకుంటేనే కొనుగోలు చేస్తానని నిర్వాహకులు చెబుతున్నారు. అందరి రైతుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. అందరితో పాటుగా తరుగుకు ఒప్పుకోవాల్సి వస్తుంది. మ్యాచర్ వచ్చినా లాభం లేదు. మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కుమ్మకై క్వింటాకు 5కిలోల ధాన్యం కట్ చేస్తున్నారు.

## సైబర్ నేరగాళ్లకు చిక్కి.. రూ.7.84 లక్షలు పోగొట్టుకున్న విద్యార్థి

కమలాపూర్, మే 2 : మండలంలోని ఉప్పలపల్లి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి గుండెకారి అభిరామ్ సైబర్ మోసగాళ్ల వలలో పడి రూ.7 లక్షల 83వేల 500 పోగొట్టుకున్నట్లు సీఐ హరికృష్ణ శుక్రవారం తెలిపారు. అభిరామ్ ఎస్ఆర్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. టెలిగ్రాం యాప్‌లో ఉద్యోగ ప్రకటన చూసి ఓపెన్ చేసి సైబర్ మోసగాళ్లు చెప్పిన విధంగా దశల వారీగా డబ్బులు పంపించాడు. నెల రోజులుగా సైబర్ మోసగాళ్లు చెప్పినట్లు డబ్బులు పంపుతూ తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించాడు. మొత్తం రూ.7లక్షల 83వేల 500 పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

## బంగారం షాపులో చోరీ

వరంగల్ చౌరస్తా, మే 2: వరంగల్ ఆర్ఎన్‌టీ రోడ్డులోని ఓ బంగారు షాపులో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. ఆర్ఎన్‌టీరోడ్డులోని సాయిగణేశ్ జ్యువెల్లర్స్ యజమాని సారా భాస్కర్ శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్లి తిరిగొచ్చేసరికి షాపు అద్దాలు ధ్వంసమై ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా 20 జతల బంగారు చిన్న కమ్మలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వెంటనే పో లీసులకు ఫిర్యాదు చేశాడు. బంగారు ఆభరణాల వి లువ రూ. 3 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఇంతేజార్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ధర్నా

వాజేడు, మే 2 : అధికార పార్టీ నాయకుల ప్రమేయం లేకుండా అర్హత కలిగిన పేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ములుగు జిల్లా వాజేడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అంతకుముందు సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు లిస్టును పక్కనపెట్టి అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారని, ముడుపులు చెల్లించిన వారిపేర్లు మాత్రమే లిస్టులో పెడుతున్నారని ఆరోపించారు. అనంతరం ఎంపీడీవో విజయకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జెజ్జరి దామోదర్, బచ్చల కృష్ణబాబు, సౌమ్య, గుగ్గిళ్ల దేవయ్య, తోలెం ముత్తయ్య, రమాదేవి, శాంతకుమారి, లింగయ్య, కృష్ణ పాల్గొన్నారు.



ఎంపీడీవోతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు